క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి జంక్షన్, ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ మల్లంపేట్, ఏసీ టైర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు రెయిన్‌బోకాలనీ, ఎస్సీఆర్ ప్రైడ్, పీసెంట్ విల్లాస్, కేఆర్‌సీఆర్ కాలనీ... అదే విధంగా 11 కేవీ నిజాంపేట్, ఎస్ఎల్‌జీ, ఎంఎస్ఎస్, మా విల్లాస్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి 11 గంటల వరకు బాచుపల్లి, ఇంద్రనగర్, ఎస్ఎల్‌జీ ఆస్పత్రి, మా విల్లాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా గురువారం కొంపల్లి సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు.
◆ 11 కేవీ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎన్‌సీఎల్ గోదావరి, దుర్గా విహార్, శాంతా శ్రీరామ్, ఆదిత్య విల్లాస్, కోణార్క్ ఆస్పత్రి ఏరియా, ప్రాగా టూల్స్ కాలనీ, జీఎల్ఆర్ ఎన్‌క్లేవ్, లక్ష్మి గంగా,
◆ 11 కేవీ పైపులైన్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బీహెచ్ఎల్ విస్టా కాలనీ, అగ్రికల్చర్, శ్వేత ఆర్యన్స్, ఆరేమ్స్‌బర్గ్, ఆర్వీ నిర్మాన్స్, మారుతి సన్‌సిటీ, సుభాష్‌నగర్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి నల్లగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలియజేసింది. 4వ తేదీన గణపతిపూజ, స్వామి వారికి అభిషేకం, లక్ష పుష్పార్చన, మంగళ హారతి, 5వ తేదీ ఉదయం 11.07 గంటలకు అభిజిత్ లగ్నమున స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు కృషి చేయాలి

జీడిమెట్ల: గ్రామంలోని దుర్గామాత ఆలయం అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులు కృషి చేయాలని ఆలయ కమిటీ కోరింది. బుధవారం బౌరంపేటలో దుర్గామాత ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శక్తానందగిరి స్వామి విశేష అతిథులుగా హాజరయ్యారు. గుడిని సందర్శించి ఆలయాన్ని వాస్తు ప్రకారం ఏ విధంగా నిర్మించాలో సూచించారు.

తండ్రి మృతిని తట్టుకోలేక..

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జవహర్‌నగర్: తండ్రి మృతిని తట్టుకోలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ సత్యనారాయణ కాలనీలో సదల బాలకృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఏప్రిల్ 12న బాలకృష్ణ తండ్రి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటినుంచి మనస్థాపానికి గురైన బాలకృష్ణ నెల 2న తనకు బతకడం ఇష్టం లేదని భార్య, కుమారుడికి ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన వారు పక్కింటి వారికి సమాచారం అందించారు. వారు వారు వచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉన్నాయి తలుపులు పగులగొట్టి చూడగా బాలకృష్ణ ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని కిందకు దింపి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్లూ జీన్ ఇన్‌ఫెర్టిలిటీ సొల్యూషన్స్‌లో తనిఖీలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని బ్లూజీన్ ఇన్‌ఫెర్టిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో బుధవారం వైద్య అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ బృందం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. బ్లూ జీన్ యాజమాన్యం అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) బిల్లు 2021లోని కొన్ని సెక్షన్లను ఉల్లంఘించినట్లు విచారణలో తేల్చారు. కౌన్సిలింగ్ నిర్వహించటం ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్-ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్, గర్భాశయ గర్భాధారణ, ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ వంటివి నిర్వహిస్తున్నారని తెలిపారు. తదుపరి నోటీసులు జారీ చేసే వరకు సేవలు నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. ఏ ఆస్పత్రి అయినా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన చర్యలు ఉంటాయని డీఎంహెచ్ఓ హెచ్చరించారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

ఢిల్లీలో బీఆర్ఎస్ భవన ఏర్పాటు..

దేశ రాజకీయాల్లో పెను మార్పు

- మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు
- పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ సీఎం అండగా ఉంటారు



కుత్బుల్లాపూర్: పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉంటారని, ఎన్నో అడ్డంకులు సృష్టించినా 2001 నుండి 2014 వరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటే ధ్యేయంగా పనిచేసే ముందుకు సాగిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు.. దేశ రాజధాని ఢిల్లీలో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఢిల్లీకి బయలుదేరుతున్న రాజు 'సాక్షి'తో మాట్లాడారు.
◆ తెలంగాణ చిత్రపటాన్ని దేశ రాజధానిలో ప్రతిబింబించేలా ముఖ్యమంత్రి పనిచేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఇప్పటికే సచివాలయం నిర్మాణం పూర్తి చేసి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరాధ్య దైవంగా మారాడని గుర్తు చేశారు.
◆ ప్రతిపక్షాలు ఎన్నో ఆరోపణలు చేస్తున్నా అవేమీ పట్టించుకోకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట పొలాలకు సహాయం చేసే దిక్కులేని ప్రతిపక్షాలు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడం రైతుల్లో భరోసా కలిగిందన్నారు.
◆ రాష్ట్రంలో రైతు బీమా మాదిరిగానే కల్లు గీత కార్మికుల కోసం 'గీత కార్మికుల బీమా'ను అమలు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయం అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన వారికి అండగా ఉందన్నారు.
◆ కుత్బుల్లాపూర్ ప్రాంతంలో గడిచిన తొమ్మిది సంవత్సరాల వ్యవధిలో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయని, నాడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి ధనార్జన ధ్యేయంగా ముందుకు సాగారని ఆరోపించారు.
◆ అభివృద్ధి కుంటూ పడిందని ఆ విషయాన్ని గుర్తించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయం ఇతర మౌలిక వసతులు కల్పించి ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వంగా వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు మాకే ఉందని స్పష్టం చేశారు.
◆ 58, 59 జీవో కింద ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న పేద మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేసి వారికి భూమిపై పూర్తి హక్కును కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 31 వరకు గడువు పొడిగించారని ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.
◆ ఢిల్లీలో పార్టీ కార్యాలయం ఏర్పాటు కావడం ఇక రాజకీయ పెను మార్పులు ఉంటాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ దేశం మొత్తం రైతుల్లో భరోసా నింపేందుకు కృషి చేస్తున్నారని తప్పకుండా దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకంగా మారనున్నారని జోస్యం చెప్పారు.
◆ బీజేపీ మతతత్వాన్ని పెంచి పోషించే విధంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. దేశ ప్రజలు తెలంగాణ ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారని అన్నారు. సబ్బండ వర్గాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉంటారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ ఢంక మోగించడం ఖాయమన్నారు.


ద్వారకానగర్‌లో భూగర్భ డ్రైనేజీ లైన్ కోసం రోడ్డును తవ్వుతున్న దృశ్యం

రోడ్డు వేసి.. తవ్వి

ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు

అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా రోడ్లు వేయడం.. భూగర్భ డ్రైనేజీ, మంచి నీరు పైపులైన్ నిర్మాణం అంటూ రోడ్లు తవ్వడం పరిపాటిగా మారింది. దీంతో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి వేసిన రోడ్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. గాజులరామారం డివిజన్‌లోని ద్వారకానగర్ ఫేస్-2లో ఇదే జరుగుతోంది. రోడ్డు వేసిన అనంతరం భూగర్భ డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వి పైప్ లైన్ వేస్తున్నారు. రోడ్డు వేసే ముందు అధికారులకు డ్రైనేజీ లైన్ గుర్తుకు రాకపోవడం విడ్డూరంగా ఉంది.
– సుభాష్‌నగర్

పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

దుండిగల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం దుండిగల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పలు అంశాలు పేర్కొన్నారు. మండలంలో చాలా వరకు ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిని ఇళ్లు లేని పేద ప్రజలకు కేటాయించాలన్నారు. ఎంతోమంది కబ్జాదారులు ప్రభుత్వ భూములను అక్రమించుకుంటున్నారని వాటిని కాపాడలేని రెవెన్యూ అధికారులు పేదలకు కేటాయించాలని కోరారు. కుత్బుల్లాపూర్ చాలామంది పేద ప్రజలు ఉన్నారని అన్నారు. వారు ఇళ్ల అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరి కొంతమంది గుడిసెల్లో జీవిస్తున్నారని అన్నారు. వారందరికీ కొంత స్థలాన్ని కేటాయిస్తే భరోసాతో బతుకుతారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఎం నాయకులు లింగస్వామి, వీరమల్లు, మల్లేష్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెళ్లి పీటలు ఎక్కించిన పోలీసులు

జీడిమెట్ల: పెళ్లి మండపానికి రావాల్సిన వరుడు రాలేదు. వరుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కంగారు పడిన పెళ్లికూతురు బంధువులు వెంటనే జీడిమెట్ల పోలీసులను సంప్రదించారు. చొరవ తీసుకున్న పోలీసులు రెండు గంటల్లో పెళ్లికొడుకుని గుర్తించి పెళ్లిపీటలు ఎక్కించారు. పెళ్లి జరగడంతో ఇరు కుటుంబాల పెద్దలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన జీడిమెటల పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.
– పెళ్లికూతురు బంధువుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన స్వాతి(22), అదే ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ పాండే(25) ప్రేమించుకున్నారు. వీరిద్దరు పెద్దలకు తెలియకుండా ఫిబ్రవరి 19వ తేదీన అల్వాల్‌లోని ఆర్యసమాజ్‌లో పెళ్లిచేసుకున్నారు. విషయం పెద్దలకు తెలియడంతో స్వాతి కుటుంబసభ్యులు పెద్దల సమక్షంలో పెళ్లి చేస్తామని ఒప్పుకున్నారు. మార్చి 24న ఇద్దరికి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంగేజ్‌మెంట్ నిర్వహించారు.
– బుధవారం (మే 3వ తేదీన) పెళ్లి నిశ్చయం చేశారు. పెళ్లి సమయానికి పెళ్లి కొడుకు మండపానికి రాలేదు. అతని ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కంగారు పడిన స్వాతి కుటుంబసభ్యులు బుధవారం ఉదయం 11గంటలకు జీడిమెట్ల పోలీసులను సంప్రదించి విషయం తెలిపారు. వెంటనే పోలీసులు కలుగజేసుకుని వరుడిని గుర్తించారు. అనంతరం వరుడిని పెళ్లిపీటల వద్దకు తీసుకెళ్లి దింపారు. పోలీసుల చొరవతో పెళ్లి జరగడంతో పెళ్లి పెద్దలు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులకు సన్మానం


జీడిమెట్ల డిపో కండక్టర్లు, డ్రైవర్లను సన్మానిస్తున్న ఈడీ యాదగిరి

జీడిమెట్ల: ఆర్టీసీ కార్మికులంతా కలిసికట్టుగా పని చేస్తే ఆర్టీసీ లాభాల్లోకి వస్తుందని గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ యాదగిరి అన్నారు. బుధవారం ఆయన జీడిమెట్ల డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్‌లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో ఆయన ముచ్చటించారు. అనంతరం వారికి తగిన సూచనలు చేసి మెలకువలను చెప్పారు. ఏప్రిల్ నెలలో ప్రతిభ కనబరచిన డ్రైవర్లు, కండక్టర్లను ఆయన శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు స్పందించారు

చింతల్: జలమండలి కార్యాలయంలో నిర్మాణ సామగ్రి డంపింగ్ చేయడంపై ఎట్టకేలకు వాటర్ వర్క్స్ అధికారులు స్పందించారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ డివిజన్ కార్యాలయం అనుబంధంగా పనిచేస్తున్న కాంట్రాక్టర్లు తమ నిర్మాణ పనులకు వాడే ముడి సరుకులు ఏడాది కాలంగా జలమండలి కార్యాలయ ఆవరణలో డంపు చేస్తున్న విషయమై సాక్షిలో ×డంపింగ్ కేంద్రంగా వాటర్ వర్క్స్ కార్యాలయం౨అను శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జలమండలి అధికారులు స్పందించారు. దీంతో జీఎం శ్రీధర్‌రెడ్డి సదరు కాంట్రాక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి నోటీసును జారీ చేసినట్లు పేర్కొన్నారు. 15 రోజుల్లోగా కార్యాలయ ఆవరణ నుంచి సామగ్రిని తరలించడంతో పాటు దీనిపై వివరణ ఇవ్వాలని కోరినట్లు శ్రీధర్‌రెడ్డి సాక్షికి తెలిపారు. వస్తు సామగ్రి ఇక్కడ నుంచి తరలించకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

జగద్గిరిగుట్ట: బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై దాడి చేశారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో కొంత కాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో దాడి చేసి వరలక్ష్మి (40), దేవి(30) నిర్వాహకులను విటుడుని అరెస్టు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోత లేని కరెంట్‌ను అందిస్తున్నాం


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోతల లేని కరెంట్‌ను అందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ అన్నారు. 20వ డివిజన్ పరిధిలోని ఎస్‌వీఎస్ ఆపర్ణ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఆయన కార్పొరేటర్ బాలాజీ నాయక్, ఏఈ శాంతాకుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ధన్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగు ముందుకు సాగుతున్నామని తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం, బీఆర్ఎస్ నాయకులు చంద్రగిరి సతీష్, ఉంగరాల శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి, అపర్ణ కాలనీ హెల్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఛాయా, ప్రధాన కార్యదర్శి ప్రతిమ, సుబ్రహ్మణ్యం, రాంభూపాల్‌రెడ్డి, గౌరీ శంకర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా

సాక్షి,మేడ్చల్ జిల్లా: జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్కె సలీమా డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రిలే నిరాహార దీక్షల్లో భాగంగా బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం టిడబ్ల్యూజేఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందన్నారు. మీడియాపై రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. జర్నలిస్టులపై వివక్ష చూపుతున్నారని టీడబ్ల్యూజే రాష్ట్ర సహాయ కార్యదర్శి గుమ్మడి ప్రసాద్ అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల డిమాండ్లను నెరవేర్చాలని నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎంపల్లి పద్మా రెడ్డి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ, శాసనసభ్యులకు వినతి పత్రాలు, జిల్లా కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు యావపురం రవి,పటేల్ నరసింహ యాదవ్ , మండపాక కళ్యాణ చక్రవర్తి తెలిపారు.అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు బెలిదే అశోక్, శివకుమార్, దేవేందర్, విష్ణు మోహన్, ఎస్.శివకుమార్, డేవిడ్ రాజ్, యాట రాజు, వినోద్, సాయిరాజ్, వెంకట్, శ్రీనివాసరావు, నరేష్, రాము, పరుశురాం, నిరంత్, ఉపేందర్, శ్రీను, వినోద్ కుమార్, ముఖేష్ గౌడ్ పాల్గొన్నారు.

1వ తేదీనే పింఛన్ పడేటట్లు చర్యలు తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన పింఛన్ బ్యాంక్ అకౌంట్‌లో పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్ అసోసియేషన్ (ట్రెటా) రాష్ట్ర సంస్కృతిక కార్యదర్శి బాలచంద్రం కోరారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎన్ రెడ్డి నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లు పడుతున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. మూడు డీఆర్‌లు, కరువు భత్యం మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ, పే రివిజన్ కమిటీని ఏర్పాటుతో పాటు వేతన స్థిరీకరణ త్వరితగతిన అయ్యేటట్లు చూడాలన్నారు. పెన్షనర్లకు ఇచ్చే పింఛన్‌ను గౌరవ భృతిగా పరిగణించాలని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలన్నారు. తక్కువ వేతనాలతో పని చేసిన వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ మండల అధ్యక్ష, కార్యదర్శులు దశరధరామశర్మ, ఎల్లారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ పరికరాలు లేకుండా పనులు చేయొద్దు


పద్మానగర్ ఫేజ్-2లో ఎయిర్‌టెక్ వాహన సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న జీఎం శ్రీధర్‌రెడ్డి

చింతల్: మురుగు నీటిపారుదల సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా మరమ్మతులు చేపట్టాలని కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం చింతల్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎయిర్‌టెక్ వాహనాలు, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. చింతల్ సెక్షన్ పరిధిలోని పద్మానగర్ ఫేజ్-2లో చేపడుతున్న మురుగునీటి పైప్‌లైన్లలో చెత్తను తొలగించే విషయంలో సిబ్బంది సేఫ్టీ పరికరాలు వాడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సేఫ్టీ పరికరాలు లేనిదే విధుల్లో పాలుపంచుకోరాదని, సేఫ్టీ పరికరాలు ధరించిన తర్వాతనే పైపులైన్ల శుభ్రం చేయాలన్నారు. ఎయిర్‌టెక్ వాహనాలను ప్రారంభించాలని సూచించారు. ప్రతి ఒక ఎయిర్‌టెక్ మెషిన్ ప్రతిరోజు ఎక్కడికి వెళ్లినా సుమారుగా 500 మీటర్లు తక్కువ కాకుండా పనులు చేపట్టాలని సూచించారు.

మురుగు సమస్య పరిష్కరించండి

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నిత్యం డ్రైనేజీ రోడ్లపై పారుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర దుర్వాసనతో ఇటు వాహనాదారులు, అటు పాదచారులు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



వృక్షాలనే కాపాడలేని వారు.. నర్సరీ మొక్కలను కాపాడగలరా!

- భారీ చెట్ల పక్కన మట్టిని తవ్విన కాంట్రాక్టర్
- వర్షాలకు నేలకొరుగుతున్న చెట్లు


వేర్లతో సహా నేలకు ఒరిగిన చెట్లు

జగద్గిరిగుట్ట: కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. నేలకొరుగుతున్న మహావృక్షాలు.. ఓ సంవత్సరం క్రితం వరకు హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులో డంప్‌యార్డ్ ఉండేది. ఇదే డంప్‌యార్డ్‌లో అక్కడక్కడ ఎన్నో ఎళ్లుగా వివిధ రకాల మహావృక్షాలు ఉండేవి. అక్కడికి వచ్చే సిబ్బందికి కూడా ఎండకు వానకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉపయోగపడేలా ఈ చెట్లు ఉండేవి. కాగా వివిధ కాలనీల నుంచి ఈ డంప్‌యార్డ్‌పై ఫిర్యాదులు అధికమవడంతో రాంకీ సంస్థ ఎస్‌సీటీపీ ఏర్పాటు చేసారు. ఈ డంప్‌యార్డ్ స్థలం ఖాళీగా ఉండటంతో జీహెచ్ఎంసీ సుమారు రూ.88 లక్షలతో నర్సరీ ఏర్పాటుకు పూనుకుంది.
◆ చుట్టూ కంపౌండ్ వాల్ నిర్మాణం కూడా పూర్తి అయ్యింది. ప్రస్తుతం కొంత భాగంలో మొక్కలు కూడా డంప్ చేసారు. కాగా ఈ నర్సరీ ఏర్పాటుకు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ లెవల్ చేయడానికి బయట నుంచి తెప్పించాల్సిన మట్టిని అదే స్థలంలో ఉన్న మట్టితో మమా అనిపించాడు. దీంతో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఈ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ఈ నర్సరీలో మహా వక్షాలను కాపాడలేని అధికారులు ఈ నర్సరీలో పెంచుతున్న మొక్కలను ఏమి కాపాడుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి జేఏసీ నాయకులు ఇటీవలే నర్సరీలో నేలకొరిగిన మహా వృక్షాలను పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బస్తీ దవాఖానా, టీకా కేంద్రం మోడల్ మార్కెట్‌లోకి మార్చండి

- అరకొర వసతులతో ఇబ్బందులు
- నిరుపయోగంగా మోడల్ మార్కెట్‌లో పట్టర్లు
- అప్పటి వరకు దవాఖానా, టీకా కేంద్రానికి వాడుకోవాలని వినతులు


సోమయ్యనగర్ మహిళా భవన్‌లో నిర్వహిస్తున్న టీకా కేంద్రం వద్ద

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో ప్రతీ రోజు ఏదో ఒక చోట ప్రభుత్వ భూములు కబ్జాలు జరుగుతున్నాయి. కాని ప్రజావసరాలకు ఎక్కడైన స్థలం కావాలంటే మాత్రం దొరకదు. పేద మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉండే జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్‌నగర్‌లో డిసెంబర్ 2022లో బస్తీ దవాఖానాను ప్రారంభించారు. కాగా బస్తీ దవాఖానాకు వచ్చే రోగల తాకిడి ఎక్కువగా ఉంటుందన్న ఉద్దేశంతో ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్‌లో మరో బస్తీ దవాఖానాకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాని అది ఇంత వరకు ప్రారంభించలేదు. ఇలా ప్రజావసరాల కోసం స్థలం దొరకక శ్రీనివాస్‌నగర్‌లో మీ సేవ సెంటర్ సగ భాగంలో ప్రారంభించారు. మరో బస్తీ దవాఖానా మోడల్ మార్కెట్‌లో ప్రారంభించడానికి పూనుకున్నారు.


నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్

టీకా కేంద్రం వద్ద క్యూ..

సోమయ్యనగర్‌లోని మహిళా భవన్‌లో కొంత కాలంగా టీకా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడికి వచ్చే బాలింతలకు తాగడానికి నీరు, నిలబడడానికి నీడ కనీసం బాత్రూంలు కూడా లేకపోవడం బాధాకరం. ఈ టీకా కేంద్రాన్ని అరకొర వసతులతో ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్‌లో నిర్వహిస్తే ఎంతో కొంత మేలు జరగవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న మోడల్ మార్కెట్ ఇప్పుడున్న ప్రారంభించలేరు.. కాబట్టి అధికారులు కనీసం ఇటువంటి ప్రజావసరాల కోసం బస్తీ దవాఖాన, టీకా కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.